క్లుప్తంగా

నేడు టంగుటూరులో 'వసుధకు వందనం'

టంగుటూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు వసుధకు వందనం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రత్నజ్యోతి తెలిపారు. కార్యక్రమానికి పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరవుతున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కొండపిలో పోలేరమ్మ తల్లికి పొంగళ్లు


బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

కొండపి: స్థానిక అనకర్లపూడి రోడ్డులో సాయిబాబా మందిరం పక్కన పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి గీతాలతో కచేరి ఏర్పాటు చేశారు. పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

పోలేరమ్మ ఆలయంలో పూజలు

జరుగుమల్లి: మండలంలోని కామేపల్లి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన పోలేరమ్మ తల్లి దేవస్థానంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ చైర్మన్ సూరంపల్లి కొండయ్య, ఈఓ రావెళ్ల శివశంకర్ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు.

వల్లూరమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో అమ్మవారిని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు నాగేశ్వరరావు, ఉమాశంకర్ అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్రనామార్చన నిర్వహించారు. భక్తులు వేటలు కోసి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఈఓ రమేష్ ఏర్పాట్లు చేశారు.

వైభవంగా అంకమ్మ తల్లికి పూజలు

గుడ్లూరు: స్థానిక మిట్టపాలెంలో అంకమ్మతల్లి తిరునాళ్లు వైభవంగా జరుగుతున్నాయి. తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం రాత్రి శివాలయం వద్ద జల్దిలో ఉంచిన అంకమ్మ ల్లి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి బయటకు తీశారు. అక్కడ అంకమ్మతల్లి విగ్రహాన్ని పట్టు వస్త్రాలతో వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, బాణా సంచా మోతలతో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చిన అమ్మవారికి మగవారు పాప వేషాలు వేసి తెల్లవారుజాము వరకు గ్రామోత్సవంలో పాల్గొని ఆలయంలోకి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవంతో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

మూడు వరిగడ్డి వాములు దగ్ధం


వరి గడ్డికి పట్ట నిప్పు ఆర్పుతున్న రైతులు

హనుమంతునిపాడు: మండల పరిధి హాజీపురంలో మూడు వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన కీచరి వెంటేశ్వర్రెడ్డి రెండు ట్రక్కులు, సానికొమ్ము చెంచిరెడ్డివి మూడు ట్రక్కులు వరిగడ్డి రాగి గడ్డి ఊరి పక్కనే ఉన్న దొడ్లలో వాములు వేసుకున్నారు. ఎవరో ఆకతాయిలు చేసిన పనికి మూడు వరిగడ్డి వాములు కాలి బూడిదయ్యాయి. గ్రామస్తులు అప్రమత్తమై ట్రాక్టర్ ట్యాంకులు, బిందెలతో మంటలను అదుపు చేయడంతో పక్క ఉన్న వరిగడ్డి వాములకు అంటుకోలేదు. కనిగిరి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

ట్రాక్టర్ తగిలి వ్యక్తికి గాయాలు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి రోడ్డులో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం కొండారెడ్డిపల్లి రోడ్డులో ఎస్సీ కాలనీకి సమీపాన ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే. కొండారెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మాశపోగు సునీల్ రోజులాగే కూలీ పని చేసుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నాడు. ఆ సమయంలో కొండారెడ్డిపల్లి వైపు నుంచి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ క్రాస్ చేయ బోయి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో సునీల్ కాలు విరిగింది. క్షతగాత్రుని 108 వాహనంలో కనిగిరి ప్రభుత్వ వైద్య శాలకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్


పాల్గొన్న బీఎల్ఏలు, నాయకులు, కార్యకర్తలు

- బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- ప్రతి ఇంట్లో ఓట్లను క్షుణ్ణంగా గుర్తించాలి
- పార్టీలకతీతంగా డబుల్ ఓట్లను గుర్తించి అభ్యంతరాలు తెలపండి

కనిగిరి రూరల్: బూత్ లెవల్ ఏజెంట్లు ఓటర్ల జాబితాపై సవరణలపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేయాలని ఎమ్మెల్యే, ఆచార్య రంగా వర్సిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం ఆదివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ వార్డుల్లో, గ్రామాల్లో ప్రతి ఇంట్లో ఓట్లను పూర్తిగా, నిశితంగా గుర్తించినప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో బూత్ లెవల్ ఏజెంట్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంగా పనిచేసినప్పుడు అనుకున్న లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఓటర్ల జాబితాలో డబుల్ ఓటర్లను ప్రతి బూత్ లెవల్‌లో గుర్తించాలన్నారు. ఈ ప్రక్రియను వారం రోజుల పాటు నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో, వార్డుల్లో స్థానికంగా లేని ఓటర్లు, దొంగ ఓట్లను, డబల్ ఓట్లను పార్టీలకతీతంగా గుర్తించి బీఎల్వోలకు 21వ తేదీ లోగా అభ్యంతరాలు ఇవ్వాలని, వారు స్పందించకుంటే మండలస్థాయి నాయకుల దృష్టికి, తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఆ జాబితాలను తాము ఆర్ఓ, ఉన్నతస్థాయి అధికారులకు అందజేస్తామన్నారు. స్థానికంగా ఉండే వాళ్ల ఓట్లను పార్టీలకతీతంగా కచ్చితంగా ఉంచాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్ఏలు ముందుండి పనిచేయాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో నిబద్ధత, అంకితభావంతో పనిచేసినప్పుడే రానున్న ఎన్నికల్లో పనిచేయడం సులభతరం అవుతుందన్నారు.

పార్టీ జెండా మోసిన వారికే పదవులు

ఎవరైతే వైఎస్సార్‌సీపీ జెండా మోస్తారో.. పార్టీ కోసం క్రమశిక్షణ, నిబద్ధతో పనిచేస్తారో.. రానున్న రోజుల్లో వారికే పదవులు ఇచ్చి పెద్ద పీట వేస్తానని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసిన చిన్న కార్యకర్తకు సైతం తాను పదవులిచ్చానని, ఇంకా ఒకరిద్దరికి న్యాయం చేయాలన్నారు. రానున్న రోజుల్లో పార్టీకి పనిచేసిన ప్రతి కార్యకర్తకు కచ్చింతా ఉన్నత స్థానం కల్పిస్తానని వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంట్లో లబ్ధి చేకూర్చాయన్నారు. ప్రజలు ఫ్యానుగుర్తుకు ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాను ప్రతి గ్రామం, ప్రతి ఇంటిని తిరిగానని, ప్రజల్లో పథకాల లబ్ధిపై మంచి స్పందన ఉందని వాళ్లంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలబడతారని స్పష్టం చేశారు. కార్యకర్తలే పార్టీకి వెన్నుముక అని అన్నారు. రానున్న ఐదు నెలలు మనమంతా కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపు నిచ్చారు. మనమంతా సమష్టిగా, సమన్వయంగా పనిచేసి కనిగిరి కొండపై మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, గాయం సావిత్రి, మూడ మంచు వెంకటేశ్వర్లు, చింతం గుంట్ల సాల్మన్ రాజు, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీలు మాణిక్యరావు, లక్కు తిరుపతిరెడ్డి, భువన గిరి వెంకటయ్య, పార్టీ మండల అధ్యక్షులు యక్కంటి శ్రీనివాసులరెడ్డి, జి.బ్రహ్మారెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, సిద్ధారెడ్డి, శ్రీహరిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు సదర్శన్, పొల్లా సుబ్రహ్మణ్యం, గజ్జల వెంకటరెడ్డి, బైరెడ్డి జయరెడ్డి, కౌన్సిలర్లు దేవరాజ్, లింకన్, దాసరి మురళీ,అరుణోదర్, సయ్యద్ నాయబ్ రసూల్, బొట్టు శ్రీను, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి ఆలయానికి భారీగా విరాళాలు


విరాళం అందజేస్తున్న కందుకూరు పట్టణ హోటల్స్, రెస్టారెంట్‌ల యజమానులు

కందుకూరు: కందుకూరు గ్రామదేవత అంకమ్మ తల్లి ఆలయ పునఃనిర్మాణానికి ఆదివారం భక్తుల నుంచి భారీ విరాళాలు అందాయి. పట్టణంలోని రెస్టారెంట్‌లు, హోటల్స్ అసోసియేషన్ తరుపున ఆయా హోటల్స్ యజమానులు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని కలిసి రూ.2,49,275 భారీ విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట రోజు అన్నదానం కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. అలాగే రైస్ మిల్లర్స్ తరుపున భారీ విరాళం అందించారు. తెట్టుకు చెందిన శ్రీనివాస బాయిల్డ్ రైస్ మిల్ మేనేజింగ్ పార్టనర్స్ కొడాలి కోటేశ్వరరావు, ముత్తినేని వెంకటేశ్వర్లు, గొర్రెపాటి సాంబయ్య, కొడాలి శ్రీధర్‌లు కలిసి రూ.3,79,999 విరాళం అందించారు. అలాగే పట్టణానికి చెందిన దామా వెంకటేశ్వర్లు రూ.50,000 విరాళం అందించారు. రమణయ్య, వెంకటశేషమ్మ దంపతులు రూ.9,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో ఇప్పటి వరకు 95శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. రూ.5 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు తెలిపారు. అమ్మవారి విగ్రహం 7 అడుగుల ఎత్తులో రూపుదిద్దుకుంటుందని, ప్రతిష్టను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 4వ తేదీ నుంచి ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభమవుతాయని, 7వ తేదీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఉంటుందని చెప్పారు. ఆ రోజు దాదాపు 20వేల మంది భక్తులు వస్తారని అంచనాతో అన్నదాన ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ నిర్మాణం పట్ల అనేక మంది పండితులు, దేవదాయశాఖ అధికారులు సంతృప్తిని వ్యక్తం చేశారని, ఆలయాన్ని అద్భుతంగా నిర్మించినట్లుగా వారు ప్రశంసించడంపై ఆలయ కమిటీ సభ్యులకు కొత్త ఉత్సాహాన్నిస్తుందని చెప్పారు. ఇక అలవేటి మండపం, రాజగోపురం వంటి నిర్మాణాలు, ఇతరత్రా నిర్మాణాలు పూర్తి అయ్యే సరికి రూ.11కోట్ల వరకు ఖర్చు అవుతుందని భావిస్తున్నామన్నారు. విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని డీఎస్పీ రామచంద్రను కోరారు. అలజడులు సృష్టించేందుకు, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే మాలకొండ దేవస్థానంలో అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు రూ. 48 లక్షల వరకు విరాళం ప్రకటించారని, ఆలయ అభివృద్ధి ప్రణాళికను తయారు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు, కొడాలి కోటేశ్వరరావు, సూరం వేణుగోపాల్‌రెడ్డి, మద్దెల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ నూతన కమిటీ ఎన్నిక


మండ్లా శ్రీనివాస్


సీహెచ్ జయప్రకాష్


బి.తిరుపతయ్య

కనిగిరి రూరల్: జనవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా 17వ మహాసభలు రెండో రోజు ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్కే ఖాజా హుస్సేన్, డీఎల్ ప్రసాద్‌లు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ రాహూల్, రాష్ట్ర కోశాధికారి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ సైన్స్‌పై విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం కార్యదర్శి నివేదికను రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ జయప్రకాష్ ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు కె.సుబ్రహ్మణ్యం, పి.స్వరూపరెడ్డి, డాక్టర్ బి.హరిబాబు, బి.తిరుపతయ్య, వి.మాలకొండారెడ్డి, మూలె బ్రహ్మారెడ్డి, ఎస్కే అక్బర్, ఎస్కే పీఎం గౌస్, బి.రుషేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ నూతన కమిటీ ఎన్నిక

జన విజ్ఞాన వేదిక నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్, డాక్టర్ బి.హరిబాబు, డాక్టర్ టి.చెన్న కృష్ణా, అధ్యక్షులుగా మండ్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా జయప్రకాష్, కోశాధికారిగా బి.తిరుపతయ్య, ఉపాధ్యక్షులుగా కె.నారాయణ, డి.గురుస్వామి, ఎస్కే ఖాజా హుస్సేన్, వెంకట్రావ్, నల్లూరి వెంకటేశ్వర్లు, డీఎల్ ప్రసాద్, కార్యదర్శులుగా కందుల రవి, ఎస్ఎం డి.రఫీ, ఏ విశ్వరూపాచారి, జి. శ్రీనివాసులరెడ్డి, ఎస్టీ వెంకటేష్, యు భాస్కర్, వైద్య ఆరోగ్య కన్వీనర్‌గా బి.శరత్, సమతా మహిళా కన్వీనర్‌గా ఎస్కే బషీరున్నీసా, సాంస్కృతిక కన్వీనర్‌గా జెడ్ రమణయ్య, యూత్ కన్వీనర్‌గా జయ శేఖర్‌లతో పాటు మరో 26 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ఆర్‌కేపల్లెలో గాంధీచిత్రపటంవద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఏపీఓ, నాయకులు, విద్యార్థులు


హనుమంతాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు


పామూరులో సెల్యూట్ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో, నాయకులు, విద్యార్థులు

హనుమంతునిపాడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ అన్నారు. ఆజాది కా అమృ త మహోత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమంతాపురం, లింగంగుంట్ల వాలిచర్ల, పెద్దగొల్లపల్లి, నందనవనం, నల్లగండ్ల, ఉమ్మనపల్లి, తిమ్మారెడ్డిపల్లి, గాయంవారిపల్లి గ్రామాల్లో నా మట్టి నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టిపై ప్రతిజ్ఞ చేశారు. మన జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ జెండా వందనం చేశారు. మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల కన్వీనర్, సింగిల్ విండో అధ్యక్షుడు యక్కంటి శ్రీనివాసులరెడ్డి మొక్కలు నాటారు. వారిపల్లిలోను , గ్రామ సర్పంచ్‌లు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ తానిగుండాల తిరుపతరెడ్డి హనుమంతాపురంలోను, వాలిచర్ల,గొల్లపల్లి సర్పంచ్‌లు అరుణమ్మ, మరియ బాబు, మాజీ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు ఆదినారాయణరెడ్డిలు ,నల్లగండ్ల సర్పంచ్ శ్రీనివాసులరెడ్డిలు మొక్కలు నాటారు. వైస్ ఎంపీపీ కొదమల బెంజి, సర్పంచ్‌లు, ఎస్ మధుసూధన్‌రెడ్డి, ఎం.రత్తలు, ఎం. తిరుపతయ్య, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఎఫ్ఏలు, వెంకటేశ్వర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

పామూరు: హర్ ఘర్ తిరంగ, వీరులకు వందనం కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా, వీరులకు వందనం, నా భూమి నాదేశం కార్యక్రమాల్లో ఎంపీపీ గంగసాని లక్ష్మి, ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు పాల్గొని అమరవీరుల స్తూపంవద్ద ఘనంగా నివాళులర్పించారు. నాభూమి నాదేశంలో భాగంగా స్వచ్ఛభారతావనిగా పుడమిని కాపాడతామని ప్రతిజ్ఞచేశారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. జాతీయజెండాతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ షేక్.రషీద్, యాదాల వెంకట సాయికిరణ్, కోఆప్షన్ షేక్.నాయబ్‌రసూల్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, ఏపీఓ బి.మాల్యాద్రి, షేక్.అబ్దుల్, గట్లా విజయభాస్కర్ రెడ్డి, షేక్.ఖాదర్‌బాషా, శ్రీరాం శ్రీను, సూరిపోగు మాల్యాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఏపీఓ వాక్యవతి అన్నారు. మండలంలోని ఆర్‌కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం వసుధకు వందనం, హర్ ఘర్ తిరంగా, నామట్టి నాభూమి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటి మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయజెండాతో ర్యాలీ నిర్వహించి. జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించి దేశాభివృద్ధికి పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. అంబాల శేఖర్, టీపీ దేవానంద్, పీఎస్‌లు జి.సురేష్, శశికళ, ఎఫ్ఏ వెంగళరావు, నాగార్జున, దొరసానమ్మ, నన్నసాని నాగేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తే సహించం


రైతులతో మాట్లాడుతున్న రావుల వెంకయ్య

కందుకూరు: సింగరాయకొండ నుంచి మాలకొండ వరకు నిర్మిస్తున్న 167బి జాతీయ రహదారి నిర్మాణానికి సేకరించిన భూములకు పరిహారం చెల్లించే విషయంలో రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని సీపీఐ జాతీయ నాయకుడు రావుల వెంకయ్య అన్నారు. ఆదివారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో రైతులకు సమావేశమయ్యారు. 2013 భూసేకరణ చట్ట నిబంధనలు ఉల్లంఘించి రైతులకు అన్యాయం చేస్తే ఉద్యమాలు చేస్తామన్నారు. రైతుల భూములు సేకరించే క్రమంలో రెవెన్యూ అధికారులు ఎటువంటి నిబంధనలు పాటించకుండా భూములు తీసుకోవడం సరికాదని, రైతుల నుంచి తీసుకున్న భూములకు ఎంత పరిహారం ఇస్తున్నారో చెప్పకుండా 10 సంవత్సరాల నాటి భూముల విలువను పరిగణలోకి తీసుకోవడం సరైంది కాదన్నారు. రైతులను బెదిరించే పద్ధతిలో భూములను సేకరించడం చట్ట విరుద్ధమని, రెవెన్యూ అధికారులు రైతులను సమావేశపర్చి భూసేకరణ వివరాలకు వారికి తెలియజేయాలని డిమాండ్ చేశారు. అధికారులు రైతుల డిమాండ్‌లను పరిగణలోకి తీసుకుని తగిన పరిహారం చెల్లించాలని లేదంటే రైతులతో కలిసి ఉద్యమాలు చేస్తామన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్‌బాబు, సహాయ కార్యదర్శి పి. బాలకోటయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనందమోహన్, మల్లికార్జునరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు ఒరిగిన విద్యుత్ స్తంభాలు

జరుగుమల్లి: మండలంలోని తూమాడు గ్రామం అశోక్‌నగర్ కాలనీ వద్ద ఆదివారం మధ్యాహ్నం వీచిన ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. దీంతో రెండు స్తంభాలు విరిగిపోయాయి. తూమాడు, పాలేటిపాడు, సాధువారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ జి.హర్షిష్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


చెట్టు కొమ్మలు విరిగి పడటంతో విరిగిన విద్యుత్ స్తంభాలు

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దర్శి సివిల్ జడ్జి దంపతులు


మహానివేదనతో ప్రదక్షిణల్లో పాల్గొన్న దర్శి జడ్జి దంపతులు, అర్చకులు, కమిటీ సభ్యులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన కైంకర్యాలను రుత్వికులు మంకాల సత్యనారాయణ వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేకువజామున నారాయణస్వామి మూల విగ్రహమూర్తికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం గోపూజ నిర్వహించిన భక్తులు తదుపరి భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బెల్లంపొంగళిని మహానివేదనగా స్వామికి సమర్పించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, గోపూజ, మహానివేదన కార్యక్రమాల్లో దర్శి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, సుబ్బారావు దంపతులు, కుటుంబసభ్యులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించగా అర్చకులు వేద ఆశీర్వచనంచేసి తీర్థప్రసాదాలు అందజేయగా ఆలయంలో అన్నదానాన్ని ప్రారంభించారు. జడ్జి దంపతులు జీవీఎల్ రస్వతి, సుబ్బారావులు ప్రముఖ పర్యాటక కేంద్రం, పుణ్యక్షేత్రమైన భైరవకోనలో జలపాతాన్ని సందర్శించి అనంతరం త్రిముఖ దుర్గా, భైరవేశ్వరాలయాల్లో పూజల్లో పాల్గొనగా అర్చకులు వారికి వేద ఆశీర్వచనంచేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భైరవకోనం ఆలయ కమిటీ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, నారాయణస్వామి ఆలయ కమిటీ సభ్యులు మంచికంటి మధుసూదన్‌రావు, ఆలా కొండమ్మ, లక్ష్మయ్య, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన జేఈ

గుడ్లూరు: మండలంలోని తెట్టు గ్రామంలో ఉన్న పెద్ద చెరువును ఇరిగేషన్ జేఈ వెంకటరమణ ఆదివారం పరిశీలించారు. చెరువులో అక్రమంగా తీసిన గోతులను పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈ మాట్లాడుతూ ఇటుకల బట్టీల యజమానులు ఇటుక రాళ్ల తయారీకి చెరువులో మట్టిని తోలుకోవడానికి అనుమతులు తీసుకున్నారన్నారు. వారు అనుమతులకు మించి మట్టిని తరలించి ఎక్కడ పడితే అక్కడ పెద్ద పెద్ద గుంటలు తీశారని స్పందనలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ గుంటలు ప్రమాదకరంగా ఉన్నాయని వారు ఫిర్యాదులో తెలపడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెరువును పరిశీలించామన్నారు. నివేదికను అధికారులకు అందచేస్తామని జేఈ పేర్కొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

మర్రిపూడి: వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్టు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్సై శివబసవరాజు సూచించారు. నోయాక్సిడెంట్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని కూచిపూడి వద్ద వాహనాదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉండాలని చెప్పారు. మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన పలువురు వాహనదారులకు జరిమానా విధించారు.

వైభవంగా ముగిసిన మొహర్రం వేడుకలు


పీర్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


డీజీ.పేటలో పీర్లతో గుండం దూకుతున్న భక్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని డీజీపేటలో మొహర్రం వేడుకల్లో భాగంగా పీర్ల గుండప్రవేశం, పీర్ల గ్రామోత్సవం కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించారు. గత 10 రోజులుగా జరుగుతున్న ఈ వేడుకల్లో ఆదివారం ఆఖరిరోజు వేకువజామున పీర్లను ఎత్తుకున్న భక్తులు నిప్పుల గుండం తొక్కారు. అనంతరం సాయంత్రం వేళ మంగళవాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్చుతూ పీర్లకు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం పీర్లస్నానంతో వేడుకలు ముగిశాయి. హిందూ, ముస్లింలు వేడుకల్లో పెద్దసంఖ్యలో పాల్గొని పీర్ల దీవెనలు పొందారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

టంగుటూరు: విద్యార్థులు చదువుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధనరాజు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు పుస్తకాలు చదివే అలవాటు చేస్తున్నట్లు లైబ్రేరియన్ చెప్పారు.

కేజీబీవీ తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారి ప్రమోద

కనిగిరి రూరల్: స్థానిక కస్తూరీ బా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా గరల్స్ చైల్డ్ డలప్‌మెంట్ అధికారి ఎం ప్రమోద ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోను రికార్డులను పరిశీలించారు. స్టోర్ రూంను తనిఖీ చేశారు. బోధన సిబ్బంది, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి విద్యా బోధన తీరు, సౌకర్యాలు, వసతుల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సయ్యద్ హసీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎం.నిడమానూరు చెరువులో చేపలు మృతి

టంగుటూరు: చెరువులో చేపలు మృతి చెంది నీటిపై తేలాడిన సంఘటన మండలంలోని ఎం.నిడమానూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామంలో ఉన్న చెరువు నీటిని ప్రజలు గతంలో తాగునీటికి ఉపయోగించుకునే వారు. ఇప్పుడు సురక్షిత మంచి నీటి ప్లాంట్లు వచ్చాక వాడుక నీరుగా ఉపయోగించుకుంటున్నారు. ఇటీవల వర్షాలకు చెరువులో నీరు అధికంగా చేరాయి. ఏం జరిగిందో ఏమో ఒక్కసారిగా చేపలు మృతి చెంది నీటిపై తేలాడాయి. దుర్వాసన వస్తుండటంతో గ్రామస్తులు వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన చేపలను సోమవారం బయటకు తీయించి, చెరువు నీటిని పరీక్ష చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి సుబ్బాయమ్మ తెలిపారు.